వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 265 సోమవారం | 29 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# మోడీతోనే అభివృద్ధి

పదేళ్లలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

2 లో..



# పెద్దాఫీసరు పెత్తనం

ఈడబ్ల్యూఐడీసీ నిర్వీర్యానికి కుట్రలు

వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు

తన జీతం మాత్రం నెలనెలా అకౌంటులో జమ

కింది స్థాయి ఉద్యోగులకు ఆరు నెలలుగా చెల్లింపులు బంద్

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులకు బ్రేక్

నిర్ణీత సమయంలో పూర్తి చేయలేక ఇబ్బందులు

ఆయన ఆరు జిల్లాలకు బాస్.. తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ) ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ). కింది స్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన సదరు అధికారి సొంత నిర్ణయాలతో టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ నిర్వీర్యానికి కుట్రలు పన్నుతున్నారన్న ప్రచారం సాగుతోంది. ఆయన ఒంటెద్దు పోకడలతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు, మౌలిక సౌకర్యాలకు తూట్లు పడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఒకవైపు జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలంటూ ఆదేశిస్తుంటే పనులను పర్యవేక్షించాల్సిన ఏఈలు, ఇతర ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా సదరు అధికారి ముప్పు తిప్పలు పెట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనతోపాటు మరో డీఈకి చెందిన సాలరీని మాత్రం ఠంఛన్‌గా ప్రతి నెల తమ ఖాతాల్లో జమ చేసుకుంటూ కిందిస్థాయి ఉద్యోగులకు మాత్రం చుక్కలు చూపిస్తున్నారు. సదరు ఈఈ నిర్వాకంతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వివిధ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు ఆగుతూ.. సాగుతున్నాయి.

- వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు 2లో..



# ఎండలతో జాగ్రత్త..

స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క

ఎండ తీవ్రత పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క కోరారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ఉగ్ర రూపాన్ని చూపుతున్నాడని, కూలీ పనులకు వెళ్ళే వారు త్వరగా పని ముగించుకుని ఇంటికి చేరుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, ఆ ప్రాంత ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. పెరగుతున్న ఉష్ణోగ్రతలు వృద్ధులు, చిన్న పిల్లలపైన తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని లేక పోతే రావద్దని మంత్రి సూచించారు.

- వరంగల్ వాయిస్, ములుగు



8లో

# దేశాన్ని కాపాడేందుకే కాంగ్రెస్‌కు మద్దతు

రాజ్యాంగానికి అత్యంత ప్రమాదకారి ప్రధాని మోడీ

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



8లో

# తాగునీటి సమస్యలపై ప్రత్యేక ఫోకస్

ప్రత్యేకాధికారి డాక్టర్ బి.గోపి

కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, పబ్లిక్ హెల్త్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష

# పెద్దాఫీసరు పెత్తనం



**ఈడబ్ల్యూఐడీసీ నిర్వీర్యానికి కుట్రలు**

**వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు**

**తన జీతం మాత్రం నెలనెలా అకౌంటులో జమ**

**కింది స్థాయి ఉద్యోగులకు ఆరు నెలలుగా చెల్లింపులు బంద్**

**ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులకు బ్రేక్**

**నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయలేకపోతున్న అమ్మ ఆదర్శ కమిటీలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆయన తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ) ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని విద్యాశాఖలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులు ఈయన కనుసన్నల్లోనే నిర్వహించాల్సి ఉంటుంది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాఠశాలల మరమ్మతులు, అభివృద్ధి పనులన్నీ ఈయన ఆదేశాలతోనే జరుగుతుంటాయి. ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభం అయ్యేలోపే వివిధ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలంటూ జిల్లా కలెక్టర్లతోపాటు ఇతర ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లేకుంటే చర్యలు తీప్పవంటున్నారు. అయితే ఈ పనుల విషయంలో జవాబుదారీ తనంగా వ్యవహరించాల్సిన సదరు ఈఈ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.



## ఆరు నెలలుగా వేతనాలు బంద్..

టీఎస్ ఈడబ్ల్యూఐడీసీలో వివిధ హోదాల్లో 19మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు పనిచేస్తున్నారు. విద్యా శాఖ అనుబంధంగా ఉన్న ఈడబ్ల్యూఐడీసీలో గత కొన్ని సంవత్సరాలుగా వీరు వివిధ హోదాలమ్లో విధులు నిర్వహిస్తున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని వీరిపై పెద్ద బాస్ పెత్తనం చెలాయిస్తున్నారు. తనతోపాటు మరో డీఈ ప్రతినెల రెంఛన్ గా జీతభత్యాలను తమ అకౌంట్ లో జమ చేసుకుంటూ కింది స్థాయి ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మాత్రం చెల్లించకుండా రాక్షస ఆనందం పొందుతున్నారు. ఆరు నెలలుగా జీతాలు లేక వారు అప్పుల పాలవుతుంటే కనిస కనికరం చూపించడంలేదు. నిధులు లేవన్న సాకు చూపుతూ వారి జీవితాలతో ఆటలాడుతున్నారు. ప్రభుత్వానికి లేఖ రాశామంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

## వారికి మాత్రం ఠంచన్‌గా వేతనాలు..

ఈడబ్ల్యూఐడీసీ ఈఈతో పాటు ఇదే శాఖలో పనిచేస్తున్న మరో డీఈ మాత్రం ప్రతి నెల ఠంచన్‌గా వారి జీత భత్యాలను అకౌంట్ లో జమ చేసుకుంటున్నారు. నిజంగానే నిధులు లేకుంటే కేవలం వారి ఇద్దరికి లక్షల జీతాలు ఎలా అకౌంట్ లో జమ అవుతున్నాయంటూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. నిధుల లేమితో ఉంటే వారికి కూడా జీతాలు రాకూడదంటున్నారు. వారు మాత్రం దర్జాగా జీతాలు తీసుకుంటూ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని మాత్రం ఇబ్బందులకు గురిచేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

## కలెక్టర్ చొరవ చూపాలి..

ఈడబ్ల్యూఐడీసీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని ఉద్యోగులు కోరుతున్నారు. చాలీ చాలని జీతంతో జీవితాలను నెట్టుకొస్తున్నామంటున్నారు. ప్రతి నెల జీతాలు చెల్లించినా అప్పులు తప్పడం లేదంటున్నారు. గత ఆరు నెలలుగా చెల్లించకపోవడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పడరాని పాట్లు పడుతున్నారు. కింది స్థాయి ఉద్యోగులను, సిబ్బందిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పెద్దసారు గద్దలా తన సొంత లాభం చూసుకోవడంపై మండి పడుతున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పర్యవేక్షణకు కూడా చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ చూపి ఔట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న 19మందికి వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# మోడీతోనే అభివృద్ధి

**పదేళ్లలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు**

**బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా**




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రధాని మోడీ పాలనలో భారత్ గొప్పగా అభివృద్ధి చెందిందని, దేశంలో మూడోసారి ప్రధానిగా బీజేపీ నుంచి నరేంద్ర మోడీనే ఉంటారని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ (జేపీ)నడ్డా ప్రకటించారు. అనేక ఏళ్లుగా సమస్యాత్మకంగా ఉన్న అయోధ్యలో ప్రధాని మోడీ కఠోర దీక్షతో శ్రీరామమందిరాన్ని నిర్మించారని చెప్పారు. ఇండియా కూటమిలోని పార్టీల నేతలు అవినీతి ఆరోపణలతో జైల్లో ఉన్నారని గుర్తు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ మానుకోట జనసభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జేపీ.నడ్డా ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి నిండిపోయేదని, బీజేపీ అధికారంలోకి వచ్చాక అవినీతి రహిత పాలన సాగుతోందని పేర్కొన్నారు. ఇండియా కూటమిలోని ముఖ్యమంత్రులు సొరెన్, కేజ్రీవాల్‌లు జైల్లో ఉన్నారని విమర్శించారు. అలాంటి పార్టీలతో ఏర్పడ్డ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పాలన ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నరేంద్రమోడీ పాలనలో భారత్ ఖ్యాతి పెరిగిందని, దేశానికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు లభించిందని వివరించారు. మళ్లీ ప్రధానిగా మోదీ ఉండాలని యావత్ దేశ ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. తప్పు చేసిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. తెలంగాణను అభివృద్ధి చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు విఫలం చెందాయని విమర్శించారు. బీజేపీ హయంలో వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టడంతో పాటు అనేక రైల్వేస్టేషన్‌ల ఆధునీకరణకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. మానుకోటను కూడ ఆదర్శ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జేపీ.నడ్డా అన్నారు. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ మీదుగా భద్రాచలం వరకు జాతీయ రహదారి నిర్మించడంతో పాటు పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంలో హైదరాబాద్ తరహాలో పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ఘనత ప్రధాని మోదీదని చెప్పారు. ప్రసిద్ధ రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు నివ్వడంతో పాటు జాతీయ గిరిజన యూనివర్శిటీని ములుగులో ఏర్పాటు చేసి సమ్మక్క-సారలమ్మల పేరిట నామకరణం చేయడం జరిగిందన్నారు. మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంలో ఏకలవ్య రెసిడెన్షియల్, కేంద్రీయ విద్యాలయా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీ లక్ష్మణ్, మానుకోట ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, యాప సీతయ్య, వద్దిరాజు రాంచందర్‌రావు, చీకటి మహేష్‌గౌడ్, మోసంగి మురళి, సింగారపు సతీష్, భూక్య సంగీత, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి జైపాల్‌రెడ్డి, నాళ్ల రమేష్ పాల్గొన్నారు.



# సివిల్ సప్లై ఎందుకు సైలెన్స్

**కోళ్లఫారాలకు రేషన్ బియ్యం**

**నూకలు చేస్తూ దానలో కలుపుతున్న యజమానులు**



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దారిద్రరేఖకు దిగువన ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలందరికీ సబ్సిడీపై ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తోంది. రేషన్ షాప్ నుంచి ప్రజల వద్దకు వెళ్లిన బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోందనే చెప్పవచ్చు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సర్కారు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నా సివిల్ సప్లై అధికారులు మాత్రం తమ భాధ్యతలు మరిచినట్టు పలు సందర్భాలల్లో అర్థమౌతోంది. మొక్కజొన్నలకు అధిక ధర ఉండడంతో నూకలుగా మార్చిన రేషన్ బియ్యాని కోళ్ల ధానలో కలిపి ఇస్తున్నారు. డోర్నకల్, కురివి మండలాల్లో వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కిలో రూ.8 నుంచి రూ.10కి కొనుగోలు చేసి, పౌల్ట్రీ ఫామ్‌లు, టిఫిన్ సెంటర్లలో పనిచేసే బ్రోకర్లకు కిలో రూ.15 నుంచి రూ.26కు విక్రయిస్తున్నట్లు సమాచారం. కొందరు అక్రమార్కులు ద్విచక్క వాహనాలపై ఉదయం 6 గంటలలోపే రేషన్ బియాన్ని సేకరించి కోళ్ల ఫారాలకు అక్రమంగా తరలిస్తున్నారు. రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యం అక్రమ తరలింపు వ్యవహారం తెలిసినప్పటికీ వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మతోన్మాద ప్రజా వ్యతిరేక పార్టీలను ఓడించాలి

**ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ప్రజలను మభ్యపెట్టి ప్రజల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాద ప్రజా వ్యతిరేక పాలకులను ఓడించాలని, ఈ క్రమంలో వామపక్ష సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తూ ప్రజా ఉద్యమాలను నిర్మాణం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) చెన్నారావుపేట మండల ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ మహమ్మద్ గోర్మియా అధ్యక్షతన సోమవారం పాపయ్య పేట గ్రామంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దారపు రమేష్ మాట్లాడుతూ పెరిగిపోతున్న ప్రజా సమస్యలతో పాటు భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, ఇందుకు మతోన్మాద బీజేపీ, మోడీ పాలనే కారణమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన శాస్తి జరగకపోతే దేశ ప్రజలకు ప్రజాస్వామ్యానికి తీరని హాని కలుగుతుందన్నారు. ప్రధానంగా మత సామరస్యం దెబ్బతిని మత కల్లోలాలు చెలరేగి నియంతృత్వం విలయ తాండవం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష సామాజిక శక్తులు అప్రమత్తమై దేశ ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన గురుతర బాధ్యత నెలకొన్నదని అన్నారు. ఈ క్రమంలో ఎంసీపీఐ(యూ) ఒక నికరమైన రాజకీయ విధానంతో ముందుకు సాగుతుందని తెలిపారు. వరంగల్- నల్గొండ- చేవెళ్ల పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తూ బీఎల్ఎఫ్ భాగస్వామ్య పక్షాలు పోటీ చేస్తున్న స్థానాలకు మద్దతునిస్తూ మిగతా చోట్ల మతోన్మాద ప్రజా వ్యతిరేక పార్టీలను ఓడించే విధంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ కార్యకర్తలు ఎక్కడికక్కడ నిర్మాణయుతంగా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూపీఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నం వెంకన్న, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్, మండల కార్యదర్శి జన్ను రమేష్, మండల కమిటీ సభ్యులు మొగ్రిశ్రీను రాజిరెడ్డి, హచ్యా వెంకట్ రెడ్డి, శోభ, చంద్రు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటుతో ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నికల సమయంలో తప్పక ఓటు వేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఓటు హక్కే కాదు మన బాధ్యత కూడా అని ప్రముఖ కవి, సాహితీవేత్త, రచయిత విశ్రాంత ఆచార్యులు డాక్టర్ బన్నా ఐలయ్య అన్నారు. సోమవారం విజయ్ పాల్ కాలనీలో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ, సురేష్ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత ఓటర్ అవేర్నెస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. యువత ముఖ్యంగా ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని, యువతే దేశానికి వెన్నుముక అని, యువత నీర్వివ్యంగా ఉండకూడదని ఆయన హితవు పలికారు. పట్టణ ప్రాంతంలో పల్లె ప్రాంతాలతో పోల్చుకుంటే ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతుందని, వచ్చే నెల 13న జరిగే లోకసభ ఎలక్షన్లలో తప్పక ఓటు వేయాలని ఆయన కోరారు. 30 రోజుల పాటు నిర్వహిస్తున్న అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీనివాస్ ను అభినందించారు.

## విద్యార్థులు మంచి స్థాయిలో ఉండాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో సామా జగన్ మోహన్ స్మారక భవన్ లో సామా జగన్ మోహన్ వర్ధంతి సందర్భంగా ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ప్రముఖ్ మాసాడి బాబురావు పాల్గొని స్వతంత్రం వచ్చినంక జాతీయ జెండా కోసం మొట్టమొదటిసారి అమరుడైన వ్యక్తి విద్యార్థి పరిషత్ కార్యకర్త సామా జగన్ మోహన్ రెడ్డి అన్నారు. జాతీయ భావాలతో ముందుకు పోయే ఏకైక సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని తెలియజేశారు. అదే విధంగా విద్యార్థులందరూ కూడా ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులు ముగించుకొని మీ భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రమేష్, సుందర్ రెడ్డి, తెలంగాణ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట లవన్ కుమార్, వరంగల్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంట హర్ష వర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరుగు శ్యామ్, నగర అధ్యక్షుడు డాక్టర్ సంపత్, కర్ణాకర్, డాక్టర్ ఓంకార్, పూర్వ నగర అధ్యక్షుడు కొత్తపల్లి సుధాకర్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామాబాబు, వరంగల్ విభాగ్ కన్వీనర్ అయితే నిఖిల్, హనుమకొండ జిల్లా ఆరేపల్లి సుజిత్, పూర్వ కార్యకర్తలు ప్రస్తుత కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ పార్క్‌లో మద్యం బాటిల్లు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఇది డోర్నకల్ మండల కేంద్రంలోని మున్సిపల్ పార్క్.. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వారు పచ్చని చెట్లు, తెల్లని లైటింగ్ ఉన్న పార్క్ లో మద్యం తాగాలనుకున్నారేమో ఎకంగా పార్క్ లో అడ్డా ఏర్పర్చుకున్నారు. తాగిన మద్యం బాటిళ్లను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఉదయం, సాయంకాలం కుటుంబ సమేతంగా పార్క్ కు వచ్చి సేదతీరుతున్న ప్రజలు బాటిళ్లను చూసి హొవ్వ అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు ఇలాంటి వాటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఇనుగుర్తి సుధాకర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా క్రియాశీలక పాత్ర పోషించి జైలు జీవితాన్ని అనుభవించిన, విద్యారంగ సమస్యలపై పోరాటం చేసిన యువ నాయకుడు అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ ఆహ్వానం మేరకు వారి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకుడిగా పోరాటం చేస్తూనే ఉన్నత విద్య ఎంఏ, బీఈడీ, ఎల్.ఎల్.బీ పూర్తి చేయడం తెలంగాణ ఉద్యమంలో జైలులో ఉండి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించడం, అనేక విద్యారంగ సమస్యలపై పోరాటం నిర్వహించిన ఇనుగుర్తి సుధాకర్ కాంగ్రెస్ లో తన సేవలు అందించాలని ఆకాంక్షించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో తరువాత జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకై కష్టపడి పనిచేయాలని కోరారు. ఇనుగుర్తి సుధాకర్ మాట్లాడుతూ తన చేరికకు సహకరించిన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, మాజీ కేంద్రమంత్రి మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్ పాల్గొన్నారు.

## ఆర్ఎంపీలపై దాడులను అరికట్టండి



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్రంలో ఇటీవల ఆర్ఎంపీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ-పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నడికూడ మండల అధ్యక్షుడు పాశికంటి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డిని తన నివాసంలో కలిసి ఆర్ఎంపీలపై దాడులను నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేయడం జరిగింది. దీనికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ స్థానిక హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓకు ఫోన్ చేసి వివరాలు కనుక్కొని దీనిపై పూర్తిస్థాయిలో నివేదిక తనకు అందజేయాలని ఆదేశాలు జారీజేశారు. ఆర్ఎంపీలపై ఎటువంటి దాడులకు పాల్పడరాదని వారికి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ప్రథమ చికిత్స చేసి ప్రజల ప్రాణులు కాపాడేది స్థానిక ఆర్ఎంపీలేనని గుర్తు చేశారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండివారి ప్రాణాలను రక్షించేది ఆర్ఎంపీలేనని, వీలైనంత వరకు ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్ఎంపీల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తానన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కడివెండి రమేష్, కోశాధికారి కర్రు సంపత్, మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి రాజేందర్, ఉపాధ్యక్షుడు సీహెచ్. శ్రీనివాస్, కోశాధికారి మార్త సురేష్, సలహాదారుడు కుసుమ శోభన్‌బాబు, సంఘ సభ్యులు, మండలంలోని అన్ని గ్రామాల ఆర్ఎంపీలు, తదితరులు పాల్గొన్నారు.

# కిండర్ ల్యాండ్ స్కూల్ అన్యువల్ డే సంబరాలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని సుబేదారి ఎస్ బీహెచ్ కాలనీలోని కిండర్ ల్యాండ్ స్కూల్ అన్యువల్ డే సంబరాలు విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ టామీ మాట్లాడుతూ ట్రై సిటీలో కిండర్ ల్యాండ్ స్కూల్ కు మంచి పేరు ప్రఖ్యాతలు పొందినట్లు ఆయన వెల్లడించారు. ఇలాంటి తరుణంలో విద్యార్థులకు విశ్లేషణాత్మకమైన, మాతృభాషలో, ఆంగ్ల భాషలో విద్యార్థినీ విద్యార్థులకు సులభతరంగా అభ్యసించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. విద్యతో పాటు వినోదం, ఆటలు, సృజనాత్మకను పెంపొందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో బోధిస్తున్నట్లు విద్యార్థుల మేధస్సును పదును పెట్టేందుకు శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక అంశాలతో నూతన ఒరవడి అవలంబించేందుకు అన్ని సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే ఉన్నతమైన విలువలను, క్రమశిక్షణ, గౌరవం వంటి అలవాట్లను నేర్పుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలలో రాణించేందుకు పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలను కూడా అలవర్చుకునే విధంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీఐటీయూ వరంగల్ జిల్లా సదస్సు ఆర్ఎస్ భవన్ ఉర్సు గుట్ట సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి నాయకత్వంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎం.సాగర్ అధ్యక్షత వహించగా సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వామపక్ష లౌకిక శక్తులను బలపరిచి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం ఆక్ట్రాయుడు కమిటీ తీర్మానం ప్రకారం రూ.26,000 చెల్లిస్తే తప్ప సగటు కార్మికుడు బ్రతకలేడని ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్న వేతనాలు పెంచలేదని మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై ఉపా లాంటి క్రూరమైన చట్టాలను ప్రయోగించి నిర్బంధిస్తున్నది అన్నారు. ఈడీ, సీబీఐ, ఈసీ, ఐటీ వంటి చట్టబద్ధ సంస్థలను తన రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు దుర్వినియోగ పరుస్తున్నది, ఇలాంటి బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ వరంగల్ జిల్లా సహా కార్యదర్శి జన్ను ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు నాగపూర్ వెంకటేశ్వర్లు, గున్నాల ప్రభాకర్, ఓదెలు అప్పాజీ, వాణి, రాజు, ఉపేందర్, హమాలి సంఘం నాయకులు యాదగిరి, ఆటో సంఘం నాయకులు ఇస్మాయిల్, బిల్డింగ్ సంఘం నాయకులు రఘుపతి, జుబేదా రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## పూజారి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మొగిలిచర్ల శివాలయం పూజారి మార్త ఓం ప్రకాష్ ఈ నెల 19 ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండగా మొగిలిచర్ల శ్రీ వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ. 33 వేల నగదుతో పాటు రెండు కింటాళ్ల బియ్యాన్ని వివేకానంద సేవ సంస్థ అందజేయగా, చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరో రూ. 5000 ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవ సంస్థ అధ్యక్షుడు ఆడెపు రమేష్, ఉపాధ్యక్షులు కామగోని రఘుపతి, ప్రధాన కార్యదర్శి బిల్లా రమేష్, కోశాధికారి రాధారపు శివకుమార్, సహాయ కోశాధికారి లెంకలపల్లి స్వామి, రాధారపు మల్లికార్జున్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలేక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవిన్యూ శాఖకు సంబంధించినవి (20), ఇతర శాఖలకు సంబంధించినవి (08) మొత్తం (28) దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జిలతో కలిసి స్వీకరించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీఎం సివిల్ సప్లయి రాంపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ చందర్, డీడబ్లూఓ స్వర్ణలత లెనినా, ఎల్ డీఎం రాజ్ కుమార్, డీఈఓ పాణిని, డీసీఓ సర్దార్ సింగ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కవులు, రచయితలపై దాడి హేయమైన చర్య



**వరంగల్ వాయిస్, కేయూ :** నిన్న వరంగల్ కాకతీయ యూనివర్సిటీ సెనెట్ ఆడిటోరియంలో జరిగిన లౌకిక విలువలు-సాహిత్యం అనే సదస్సులో ఫాసిస్టు మూకలు ఏబీవీపీ గూండాలు, ప్రముఖ కవులు ప్రొఫెసర్ కాత్యాయిని, డాక్టర్ పసునూరి రవీందర్, నరేష్ కుమార్ సూఫీ, మెర్సీ మార్గరెట్ మీద దాడి చేసి గాయపర్చి, సదస్సును అడ్డుకోవడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు, దాడి చేసిన వారిని గుర్తించి వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. వలి ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తితో సాహిత్య సదస్సు జరుపుతుంటే, ఫాసిస్టులు మూక దాడికి పాల్పడటం భావ ప్రకటనా స్వేచ్ఛ మీద దాడి చేయడమే అని వారు అన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటనా పూర్వపరాలను విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మతోన్మాద శక్తుల ఎదుగుదలను అడ్డుకునేందుకు వామపక్ష లౌకిక సామాజిక ప్రగతిశీల శక్తులంతా ఐక్యం కావాలని వారు పిలుపునిచ్చారు.

## అనారోగ్యంతో కారోబార్ మృతి



**వరంగల్వాయిస్, పర్వతగిరి:** మండలంలోని నారాయణపురం గ్రామపంచాయతీలో కారోబార్ గా విధులు నిర్వహిస్తున్న కందికట్ల రామచందర్ గత పది రోజులుగా కిడ్నీ లివర్ సంబంధిత సమస్యతో బాధపడుతూ ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. విషయాన్ని తెలుసుకున్న పర్వతగిరి మండల ఎంపీడీవో మాలోతు శంకర్ పార్థీవదేహానికి పుష్పగుచ్చం వేసి నివాళు లర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని నింపారు. ఎంపీడీవో వెంట ఎంపీఓ పాక శ్రీనివాసులు, గ్రామ కార్యదర్శి చిరంజీవి, మాజీ సర్పంచ్ రామ్మోహన్ పాల్గొన్నారు.

## కవులు, రచయితలపై దాడి సరికాదు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం, కవులు రచయితలపై జరిగిన దాడిని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు ఖండించారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర సదస్సులో వక్తలు ప్రసంగిస్తుండగా వారిపై ఏబీవీపీకి చెందిన వారు చేసిన దాడి అప్రజాస్వామికమన్నారు. సాహిత్యపరంగా చర్చ జరుగుతున్న సమయంలో కవులు, ప్రజాస్వామికవాదులు, రచయితలపై చేసిన భౌతిక దాడి కాకతీయ యూనివర్సిటీలో హిందూ మతోన్మాదుల అరాచకాలకు నిదర్శనమన్నారు. గతంలో చైతన్య కాలేజ్ లైబ్రరీ పై దాడి చేసి పుస్తకాలను ధ్వంసం చేసిన చరిత్ర ఈ సంఘ నాయకులది అన్నారు. యూనివర్సిటీలో ప్రజాసామిక వాతావరణం ఏర్పాటు చేయాలని వైస్ ఛాన్స్ లర్ ను ఆయన డిమాండ్ చేశారు. క్యాంపస్ లో మతోన్మాద దాడులను ఎండగట్టాలని లౌకిక ప్రజాస్వామిక విద్యార్థి సంఘాలను ఆయన కోరారు.

## మే డేను జయప్రదం చేయండి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మే 1న 138వఅంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఊరూరా, వాడవాడలో ఎర్రజెండాలు ఎగురవేసి శ్రమ దోపిడికి వ్యతిరేకంగా, కార్మిక రాజ్య స్థాపన కోసం పోరాడేందుకు ప్రతినబూనాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసి త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాసి, రద్దుచేసి పెట్టుబడి దారి వర్గాలకు ఊడిగం చేసేందుకు నాలుగు కోడ్ లను తెచ్చిన బీజేపీ మోడీ ప్రభుత్వానికి లోక్ సభ ఎన్నికలలో కార్మిక వర్గం తగిన గుణపాఠం చెప్తుందన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం చికాగో అమరవీరులందించిన స్ఫూర్తితో రానున్న కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా చైతన్యంతో సంఘటితమై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని వెంకట్రాములు శ్రమజీవులకు విజ్ఞప్తి చేశారు.

## మార్త భిక్షపతి ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో మలి విడత ప్రచారంలో భాగంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో 43 బూత్ లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేశారు. దేశంలో రైతుల పక్షపాతి నరేంద్ర మోడీ అన్నారు. ఎరువులపై సబ్సిడీ ఇస్తూ, కరోనా నుంచి ఇప్పటి వరకు పేద వారి కోసం ఉచిత బియ్యం ఇస్తూ ప్రజల ప్రజల అభివృద్ధి కోసం కంకణ బద్ధడై ఉన్న నరేంద్ర మోడీని మూడోసారిగా ప్రధానమంత్రి చేయాలని ప్రజలను కోరుతూ గడపగడపకు బీజేపీకరపత్రాలు పంచారు. భారతదేశం సౌభాగ్యంగా ఉండాలంటే నరేంద్ర మోడీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కుక్కల విజయ్, బూత్ అధ్యక్షుడు వెల్దండ హేమంత్, పెగడ నిఖిత్, పెసరు గణేష్ పాల్గొన్నారు.

## బీజేపీని ఓడించి.. మోడీని గద్దె దించండి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బీజేపీని ఓడించి మోడీని గద్దె దించండని సీపీఐ పట్టణ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మహబూబాబాద్ పట్టణ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం నర్రా శ్రావణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలో మోడీ శకం ముగియబోతుందన్నారు. బీజేపీకి 100 సీట్లు మించి రావని, ఇండియా కూటమిదే అధికారమని పిలుపునిచ్చారు. 350 సీట్లకు మించి గెలుపొంది కేంద్రంలో ఇండియా కూటమి మంచి పరిపాలన అందిస్తుందన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి బలరాం నాయక్ కు రెండు లక్షల మెజార్టీ గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. బలరాం నాయక్ గెలుపు కోరుతూ మే 3న సీపీఐ 5వేల మందితో ఎన్నికల సభను నిర్వహిస్తుందని పిలుపునిచ్చారు. సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సీపీఐ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, తండ సందీప్, నర్రా శ్రావణ్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

## మే 3న మానుకోటలో సీపీఐ సభ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఇండియా కూటమి అభ్యర్థి బలరాం నాయక్ గెలుపు కోసం మే 3న మానుకోటలో సీపీఐ నిర్వహించే సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ మరిపెడ మండల కార్యవర్గ సమావేశంలో నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో పాలనగావిస్తున్న బీజేపీ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించకపోగా, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో పూర్తిగా విఫలమై, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. అలాగే దేశ సంపదను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు బరితెగించి కట్టబెడుతూ, మత విద్వేషాలను రెచ్చగొట్టి మరోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నించే బీజేపీ, తెర వెనక మిత్రుడైన బీఆర్ఎస్ కు ఈ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మే 3న మానుకోటలో జరిగే పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అభ్యర్థి బలరాం నాయక్ లు హాజరవుతారని తెలిపారు. కాబట్టి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకయ్య, నారాయణ, సైదులు, వెంకటేష్, కార్తీక్, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 30 మంగళవారం రేగొండ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యే భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ నడికూడ మండల అధ్యక్షుడు అప్పం కుమారస్వామి పిలుపునిచ్చారు. పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం మంగళవారం జరిగే సభకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర దేవేందర్ గౌడ్ ,డాక్టర్ మల్హాలాల్ రావు ల ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని రైతులు, మహిళలు, యువతకు, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాగానే యువతకు 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, నిరుపేద మహిళలకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం, బీసీ కుల గనన, రూ.25 లక్షల ప్రమాద బీమా, రిజర్వేషన్ల కొనసాగింపునకు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



**వరంగల్ వాయిస్, దామెర :** లోక్ సభ న్నికలలో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సోమవారం దామెర మండలం దమ్మన్నపేట గ్రామంలోని 112వ బూత్ లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ నియోజకవర్గం ప్రభారి గుజ్జ సత్యనారాయణ రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయవలసిందిగా ఓటరు మహాశయులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజ్, బూత్ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల సుమంత్, ప్రశాంత్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు స్వీప్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, ములుగు :** పార్లమెంట్ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు అవగాహన సదస్సు కార్యక్రమాలలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ములుగు కార్యాలయంలో ఉదయం 9:00 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఉద్యోగులు, యువతీ యువకులు, యువజన సంఘాలు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు, ఇతర ఆసక్తి కలిగిన వారందరూ స్వచ్ఛందంగా రక్తదాన శిబిరానికి హాజరై రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడంలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# అరూరి రమేష్‌ను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కమలం పువ్వు గుర్తుకు ప్రచార కరపత్రం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఏకు శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు వేల్పుల సూరన్న, పరకాల నియోజకవర్గం ఇంచార్జి మంద రాజు మాదిగలు ముఖ్యఅతిథిగా పాల్గొని కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం పరకాల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ రాజుపేట 18, 19 వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాబట్టి, మాదిగలు ఏకతాటిపైకి వచ్చి మాదిగలకు విలువ నిచ్చే పార్టీలకు ఓటు వేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకునేంత వరకు బీజేపీకి మద్దతుగా ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు అహర్నిశలు కృషి చేసి వారిని గెలిపించాలని కోరారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగల మోసం చేశాయని, మాదిగలకు ఎంపీ టికెట్లు కూడా కేటాయించని పార్టీలను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకుడు ముఖేష్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, ఎమ్మెస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు బొచ్చు ప్రశాంత్ మాదిగ, బుర్ర మహిపాల్ మాదిగ, శాయంపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోకిల సమ్మయ్య మాదిగ, గోవింద సదయ్య మాదిగ, మొలుగూరి భాను మాదిగ, కోయిల రాకేష్ మాదిగ, బుర్ర బాబు, బుర్ర రాజేష్, గోవింద రాజు మాదిగ, గోవింద సుభాష్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిల ఆదేశానుసారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందని, ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం కోరారు. ఈ ఆరోగ్య శిబిరం ఊసకోయిల ప్రకాష్ అధ్వర్యంలో జరగగా రెడ్ క్రాస్ డాక్టర్లు డా. జె.కిషన్ రావు, డా.మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, అరువ గంగాధర్, అనిల్, జక్కోజు నరసింహ చారి, రాజు, నాయకులు గజ్జెల రమేష్, ఓల్లాల రమేష్, శ్రీ రామోజు మొండయ్య, మర్రి దేవరాజు, కొండపాము సుహాసిని, బొల్లంపల్లి రాజు, అంబాల రాజు కుమార్, నగరబోయిన నాగరాజు, బల్లి సుమన్, కుమార్, ఆసరి, బుచ్చి రెడ్డి, చేపల రామచంద్రా రెడ్డి, దొంత శ్రీనివాస్, రొడ్డ విజయ్, శ్రీరామోజు వెంకటేశ్వర్లు గ్రామస్థులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో 104 మందికి షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సంకీసా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** విద్యార్థులు తన ఉపాధ్యాయులతో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం మధురానుభూతిని మిగులుతుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 25 సంవత్సరాల క్రితం చదువుకుంటూ విడిపోయన విద్యార్థులు తిరిగి ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఒక్కచోట కలుసుకునేందుకు చిన్ననాడు చదువుకున్న ఆ విద్యాలయమే వేదికైంది. డోర్నకల్ మండలంలోని పెరుమాండ్ల సంకీసా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1998-99 సంవత్సర పదో తరుగతి విద్యార్థుల అత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అలానాటి ఉపాధ్యాయులు సదానందం, ఉస్మాన్ ఆలీ, సాంబమూర్తి, రామ్మూర్తి, నరేందర్ లు మాట్లాడుతూ బాల్యంలో తల్లిదండ్రులు గురువులైతే విద్యాబోధనతో పాటు సమాజంలో మెలకువలను నేర్పించేది ఉపాధ్యాయులన్నారు. ఒకే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని నేడు వేర్వేరు రంగాల్లో వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి వివిధ ప్రాంతాలు, రాష్ట్రలతో పాటు విదేశాల్లో స్థిరపడినవారు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటాపాటలతో సరదాగా గడిపారు. చిన్ననాటి చిలిపి పనులు, మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ప్రస్తుతం వారు స్థిరపడ్డ రంగాలు, అనుభవాలను మిత్రులతో పంచుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఇందుకు ముందుండి శ్రమించిన కాడెం ఉపేందర్, సోమనబోయిన స్వప్నలను విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. గండు బాబు, తుమ్మ విష్ణువర్ధన్, మామిండ్ల రవి, మురళి, రెడ్యా, వెంకటేశ్వర్లు, వాసవి, రాధిక, శ్యామల, తుమ్మ ఉషా పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబాలకు అండగా ఉంటా

### ములుగు ఎస్పీ శబరిష్



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లాలలో అటాచ్ మెంట్ పై హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహించిన కే. దేవయ్య 2023 నవంబర్ లో అనారోగ్యం కారణంగా మరణించారు. కాగా, మరణించిన కే. దేవయ్య కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన భద్రత నగదును అందేలా కృషిచేసిన ఎస్పీ ఆ చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో దేవయ్య భార్య శారద, కొడుకు భద్రత చెక్కును జిల్లా ఎస్పీ చేతుల మీదుగా తీసుకొని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ దేవయ్య కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరుపున అండగా ఉంటామని తెలిపారు. దేవయ్య సేవలకు ములుగు జిల్లా పోలీస్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ తెలియజేశారు.

# బీజేపీ ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజాస్వామ్య భారతదేశంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరించి వేస్తూ పాలన కొనసాగిస్తున్న బీజేపీ దాని అనుబంధ సంస్థల ఫాసిస్టు విధానాలను దేశంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలని, ఆదివారం కాకతీయ విశ్వవిద్యాలయంలో సాహిత్యకారులు, కవులపై దాడి చేసిన మతోన్మాదులను వెంటనే అరెస్టు చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు, కవులు, సాహిత్యకారులు డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ లోని కాకతీయ యూనివర్సిటీలో లౌకిక విలవలు-సాహిత్యం అనే అంశంపై జరిగిన సదస్సులో పాల్గొన్న సాహిత్యకారులు, కవులు, ప్రొఫెసర్లు, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలైన కాత్యాయని విద్మహే, పసునూరి రవీందర్, అంపశయ్య నవీన్, మెర్సీ మార్గరెట్, నందిని సిద్ధారెడ్డి, ఖాదర్ మోయినోద్దీన్, లక్ష్మినర్సయ్య, యాకూబ్, అన్వర్, నాళేశ్వరం శంకరం, రూపారుక్మిణి, అనిశెట్టి రజిత, బన్నా ఐలయ్య, సైబాబా, కె ఆనందాచారి, సౌధా అరుణ, బమ్మిడి, భూపతి వెంకటేశ్వర్లు, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, మచ్చ దేవేందర్, తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య తదితర ప్రముఖులపై హిందూ మతోన్మాద మూకలు విచక్షణారహితంగా తిట్టి, భౌతికంగా దాడులు చేయడంపై హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ వద్ద సోమవారం జరిగిన నిరసన ధర్నాలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ నిరసన ధర్నాలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, సమూహ కన్వీనర్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, కవి, విమర్శకులు, చరిత్రకారులు ప్రొఫెసర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు, విముక్త చిరుతల కక్షి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులు మచ్చ దేవేందర్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మార్క శంకర్ నారాయణ, తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ సోమ రామమూర్తి, భారత్ బచావో నాయకులు జైసింగ్ రాథోడ్, జి. సోమయ్య, రాజ్ మహ్మద్, మాధార్ సాహెబ్, డోరి రాజయ్య, దళిత బహుజన బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, ప్రజా ఫ్రంట్ నాయకురాలు రమాదేవి, ప్రజాస్వామ్య రచయితల వేదిక నాయకురాలు అనిశెట్టి రజిత, రజక రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, చైతన్య మహిళా సంఘం జె. కళ, అనిత, సీపీఎం హనుమకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల చక్రపాణి, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి సారంగపాణి, జయంత్, ప్రవీణ్, రైల్వే జాక్ నాయకులు కొండ్ర నరసింగరావు, నాగపురి రాజయ్య, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్ రావు, బీఎస్పీ నాయకులు కన్నం సునీల్, న్యాయవాదులు జెజె స్వామి, ఎగ్గడి సుందర్ రామ్, కూనూరు రంజిత్ గౌడ్, సారంగపాణి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు సదానందం, ప్రజా కవి యోచన, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నన్నెబోయిన తిరుపతి యాదవ్, జగపతిరావు, బిల్లా సుబ్బారావు, వివిధ సంఘాల నాయకులు ఐతం నగేష్, కన్నాల రవి, ఉప్పలయ్య, కుమారస్వామి, అర్జున్, తెలంగాణ కొమరయ్య, కేడల ప్రసాద్, భాసిత్, వద్దెబోయిన శ్రీనివాస్, కొమ్ముల కరుణాకర్, మాధాసి సురేష్, భద్రయ్య, మోరే ఐలయ్య పాల్గొన్నారు.

# రెండో పీఆర్సీని అమలు చేయండి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లకు 2023 జూలై 1 నుంచి రావలసిన రెండవ పీఆర్ సీని 40 శాతం ఫిట్ మెంట్ తో వెంటనే ప్రకటించి అమలు చేయాలని (సీఐటీయూ) తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషన్ ఆహ్వానం మేరకు సోమవరం మధ్యాహ్నం హైదరాబాదులోని బీఆర్ కే భవన్ లో పీఆర్సీ కమిటీ చైర్మన్ ఎన్.శివశంకర్ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్, పీఆర్సీ కమిటీ సభ్యులు బి.రామయ్య రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ లతో యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. గతంలో ఇచ్చిన పీఆర్సీ నివేదికలో పేర్కొన్న అంశాలతో పాటు సవివరమైన సమగ్ర నివేదికను అందించి కూలంకషంగా చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ప్రధానంగా కనీస వేతనం రూపాయలు 30400, గరిష్ట వేతనం 2,58,980 రూపాయలుగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన పీఆర్సీని వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఫసియుద్దిన్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బి.కిరణ్మయి, బైరపాక శ్రీనివాస్, జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, హామీలు నెరవేర్చకుండా పార్లమెంట్ ఎన్నికల్లో తిరగలేని పరిస్థితి నెలకొన్నదని, ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం తప్పదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో వార్డుల వారీగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ కు మనమందరం మద్దతు తెలిపి మంచి మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మన అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్ కుమార్ ను బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కవులు, రచయితలపై దాడి దుర్మార్గపు చర్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం కవులు రచయితలు కళాకారులపై ఏబీవీపీ చేసిన అరాచకపు భౌతిక దాడిని వామపక్ష, బహుజన విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ దాడులను ఖండిస్తూ సోమవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్ల కార్డ్స్ చేత బట్టి, మూతికి నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయంలో సెక్యులర్ రైటర్స్ ఫోరం సమూహ ఆధ్వర్యంలో కవులు, కళాకారులు ,రచయితలు “లౌకిక తత్వం – సాహిత్యం”అనే అంశంపై సెనేట్ హాల్ లో సదస్సు నిర్వహిస్తుంటే ఏబీవీపీకి చెందిన వారు లోపలికి వెళ్లి సభా వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్ ను చింపి, సభను, రచయితల ప్రసంగాలను అడ్డుకొని, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కాత్యాయిని, సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన యువ రచయిత డాక్టర్ పసునూరి రవీందర్, నరేష్ కుమార్ సూఫీ, మెర్సీ మార్గరేట్ తదితరులను అసభ్య పదజాలంతో దూషిస్తూ, భౌతిక దాడికి దిగడమే కాకుండా అక్కడి మహిళా రచయితలపై అనుచితంగా వ్యవహరించారు. ఇది పూర్తిగా భావ ప్రకటన స్వేచ్ఛపై, ప్రజాస్వామ్య హక్కుల పై జరిగిన దాడిగా భావిస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీలో వివిధ విభిన్న దృక్పథాలపై, భావజాలంపై స్వేచ్ఛాయుత చర్చలు చేయకుండా దాడులకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.విశ్వవిద్యాలయాల్లో ప్రశాంతమైన అకాడమిక్ వాతావరణం భావ ప్రకటనను ధ్వంసం చేసే విధంగా విద్యార్థులు, కవులు, రచయితలపై దాడులకు పూనుకుంటున్నా ఏబీవీపీ చర్యలను విద్యార్థులు, ప్రజాస్వామివాదులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ద్వారా విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ వర్గాల విద్యార్థులంతా రిజర్వేషన్లు ఎత్తివేసి, రాజ్యాంగాన్ని మార్చి, మన ధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని చూస్తున్న బీజేపీ దానికి అనుబంధంగా పనిచేస్తున్న ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ కుట్రపూరిత చర్యలను గ్రహించి, రాజ్యాంగ పరిరక్షణ కోసం, పౌరుల ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదం తిరుపతి, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేయూ రీసెర్చ్ స్కాలర్ బి.నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రాజేష్, పీడీఎస్ యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీనా సుల్తాన్ , వివిధ వామపక్ష, బహుజన విద్యార్థి సంఘాల నాయకులు రంజిత్, చరణ్, మహేష్, వంశీ, హరీష్, గోపి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల గొంతుక కమ్యూనిస్టులే



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా సమస్యల ప్రశ్నించే గొంతుగా కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ తెలిపారు. సీపీఐ వంద సంవత్సరాల సమరశీల పోరాటాల చరిత్ర కలిగి ఉండి ఈ దేశంలో అంతరాలు లేని సమాజం కోసం, సమ సమాజ నిర్మాణం కోసం నిరంతరం పరితపిస్తుందన్నారు. స్వాతంత్రం వచ్చి అనేక దశాబ్దాలు గడుస్తున్నా పాలకవర్గాలు ఇంకా దారిద్ర్య దిగువకు సుమారు రూ.40 కోట్ల మంది జీవించడం బాధాకరమని, పేదవాడికి ఇల్లు ఇళ్ల స్థలాలు.. కూడు గుడ్డ.. ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం పాలక పార్టీలు నిర్లక్ష్యం చేశాయన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం జరిగిందని, డాక్టర్ కె.నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో సీపీఐ పార్టీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్మించి, ప్రభుత్వ రంగ సంవత్సరం నెలకోల్పేందుకు అహర్నిశలు కృషి చేసిందని అన్నారు. కానీ, నేటి కేంద్రం ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తూ నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్మేందుకు సిద్ధమైందని దుయ్యబట్టారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కూడా అమ్మేందుకు సిద్ధమవడం సిగ్గుచేటన్నారు. సీపీఐ తెలంగాణలో నిజాం వ్యతిరేక పోరాటంలో 4500 మంది తమ రక్తం ధారపోసి 3000 గ్రామాలను విముక్తి చేశారన్నారు. లక్షలాది ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందన్నారు. దాని ఆనవాళ్లు వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రతి గ్రామానికి ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలు కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వరంగల్ మహానగరంలో భారీ పరిశ్రమ ఏర్పాటు చేయుటకు కేంద్ర రాష్ట్ర పాలకులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మహబూబాద్ జిల్లా కార్యదర్శి పి విజయసారథి, నాయకులు పంజాల రమేష్, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, మద్దెల ఎల్లేష్, స్టాలిన్., కర్రె లక్ష్మణ్, మునగాల భిక్షపతి, కొట్టెపాక రవి, దీన, సంతోష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పోస్ట్‌ను పరిశీలించిన దిలీబన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గీసుకొండ మండలం కొమ్మాల వద్ద స్టాటిస్టికల్ సర్వెలెన్స్ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను వరంగల్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు దిలీబన్ సోమవారం పరిశీలించారు. చెక్ పోస్ట్ వద్ద ఎస్ఎస్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న తనిఖీ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రియాజుద్దీన్, ఇతర అధికారులు, ఎస్ఎస్టీ బృందం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వీప్‌తో ఓటరు చైతన్యానికి కృషి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ కుమార్ పల్లి, రెడ్డి కాలనీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు చైతన్య కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలు కలిసి ఇంటింటా తిరుగుతూ ఎన్నికల్లో తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ బద్రు నాయక్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మేన శ్రీను, మెప్మా డీఎంసీ రజిత రాణి, ఏడీఎంసీ వెంకట్, సీఓలు స్వాతి, సునీల్, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




# రామాయణంపై నెటిజన్ల అత్యుత్సాహం

ఆలూలేదు..చూలూ లేదన్న సామెత లాగా ఇప్పుడు రామాయణం సినిమా కథ నడిపించేస్తున్నారు. రణబీర్‌కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రామాయణ' సినిమా షూటింగ్ ఇటీవలే ముంబయిలో మొదలైందన్న విషయం నిర్మాతలకే తెలియదు. కానీ షూటింగ్ ప్రారంభం అయినట్లు సోషల్ మీడియాలో షేక్ చేస్తున్నారు. ఈ చిత్రంలో సీతారాముల పాత్రల్లో సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తుండగా, రావణాసురుడి పాత్రను కన్నడ అగ్ర హీరో యష్ పోషిస్తున్నారు. నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా అంచనాలున్నాయి. ఇదిలావుండగా రావణుడి పాత్ర కోసం యష్ ఇప్పటి నుంచే కసరత్తులు చేస్తున్నట్లు తెలిసింది. కాస్త భారీకాయంతో కనిపించేందుకు ఆయన 20 కిలోల బరువు పెరగాలని నిర్ణయించుకున్నారట. ఇప్పటికే ఈ దిశగా ఆయన ప్రయత్నాలు మొదలు పెట్టారని అంటున్నారు. ప్రస్తుతం యష్ 'టాక్సిక్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాతే ఆయన 'రామాయణ' సెట్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. ప్రస్తుతం ముంబయిలో వేసిన అయోధ్య సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. సాయిపల్లవి జూన్‌లో షూటింగ్‌లో జాయిన్ కానుంది.

# పుష్పలో ముందు సుహాస్‌ను అనుకున్నా

## మనసులో మాట చెప్పిన సుకుమార్



అల్లు అర్జున్ హీరోగా తాను తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ మూవీ 'పుష్ప' లోని ఫ్రెండ్ క్యారెక్టర్‌కు ముందుగా సుహాస్‌ని అనుకున్నామని దర్శకుడు సుకుమార్ తెలిపారు. 'ప్రసన్నవదనం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై, ఈ ఆసక్తికర విషయం పంచుకున్నారు. సుహాస్ హీరోగా అర్జున్ వై.కె. తెరకెక్కించిన చిత్రమిది. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ హీరోయిన్లు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో ఈవెంట్‌ను శుక్రవారం నిర్వహించింది. సతీసమేతంగా సుకుమార్, మరో దర్శకుడు బుచ్చిబాబు హాజరయ్యారు. 'సుహాస్.. నువ్వంటే నాకు, అల్లు అర్జున్‌కు ఇష్టం. నీ ఎదుగుదల చూస్తున్నాం. 'పుష్ప'లోని హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ కేశవగా ముందు నిన్నే అనుకున్నాం. కానీ, అప్పటికే హీరోగా చేస్తున్న నిన్ను ఆ రోల్‌కి ఎంపిక చేయడం బాగోదనిపించింది. నాని నటన నాకు బాగా ఇష్టం. సుహాస్.. ఫ్యూచర్ నానిలా అనిపిస్తున్నాడు. సహజ నటుడు నాని కాబట్టి సుహాస్‌ని మట్టి నటుడు అనాలేమో. అంతగా ఆయా పాత్రల్లో ఇమిడిపోతాడు. ఈ సినిమాలో రాశీసింగ్, పాయల్ రాధాకృష్ణ చక్కగా నటించారు' అని ప్రశంసించారు. తన వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన అర్జున్ గురించి మాట్లాడుతూ.. నేను 'జగడం' సినిమా రూపొందిస్తున్న సమయంలో అర్జున్ నన్ను కలిశాడు. 'మీ 'ఆర్య' చిత్రం నాకు బాగా నచ్చింది సర్. మీ వద్ద పని చేయాలనుకుంటున్నా' అని అన్నాడు. టీమ్‌లో జాయిన్ చేసుకున్నా. చాలా అమాయకుడు. కానీ, లాజిక్ ఉన్నవాడు. అర్జున్, మరో అసిస్టెంట్ తోట శ్రీనుతో కలిసి 23 రోజుల్లో '100శాతం లవ్' స్టోరీ రాశా. అప్పటి నుంచి నా ప్రతి సినిమాకి వీరిద్దరు పనిచేశారు. వీళ్లతోపాటు ఒక్కో చిత్రానికి ఒక్కొక్కరు యాడ్ అవుతూ ఉండేవారు. అర్జున్ బిజీగా ఉండడంతో నేను లాజిక్ ఉన్న సినిమాలను మానేశా. అర్జున్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి.. నా అర్జున్‌ని సపోర్ట్ చేయండి' అని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు.





# వాటితో నేను విసిగిపోయా


బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతూనే హాలీవుడ్‌లో స్థిరపడ్డారు ప్రియాంక చోప్రా. అక్కడకు వెళ్లిన తొలినాళ్లలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. అక్కడి వారెవరూ కనీస గౌరవం ఇవ్వలేదన్నారు. 'భారత్‌లో ఉన్నప్పుడు హాలీవుడ్ ప్రముఖ మ్యాగజైన్‌ల కవర్‌పై నా ఫొటో ఆరుసార్లు వచ్చింది. విదేశాలకు వచ్చాక ఎవ్వరూ కనీసం నాతో ఒక మీటింగ్ కూడా నిర్వహించలేదు. ఎన్నో ఎదురుదెబ్బలు, తిరస్కరణలు అనుభవించాను. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మౌనంగా నాపని నేను చేశాను. అదే ఈరోజు హాలీవుడ్‌లోనూ నాకు గుర్తింపు రావడానికి కారణమైంది. భారత్ నుంచి ఇక్కడకు రాగానే ఎంతో భయపడ్డాను. నాకు తెలియని పరిశ్రమ, పలకరించేవారు ఎవ్వరూ లేరు. ఒక్కోసారి అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న భావన మనసును కుంగదీసేది. అయినా ధైర్యంగా ముందుకు సాగాను' అని చెప్పారు. గతంలో ప్రియాంక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బాలీవుడ్ లోని రాజకీయాలకు విసిగిపోవడం వల్లే హాలీవుడ్ లో స్థిరపడ్డాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'హిందీ చలన చిత్ర పరిశ్రమలో నన్ను ఓ మూలకు తోసేశారు. ఎవరూ నాకు అవకాశాలు ఇవ్వట్లేదు. పలువురితో విభేదాలు ఏర్పడ్డాయి. అక్కడ రాజకీయాలు ఉంటాయి. వాటితో నేను విసిగిపోయా. అందుకే బాలీవుడ్ నుంచి బ్రేక్ తీసుకోవాలనిపించింది. అలా అమెరికా వచ్చేశా' అని చెప్పారు. ఇటీవల తన భర్తతో కలిసి 'లవ్ అగైన్' తో అలరించిన ప్రియాంక.. 'హెడ్ ఆఫ్ స్టేట్' అనే యాక్షన్ కామెడీ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే త్వరలో విడుదల కానున్న 'టైగర్' అనే డాక్యుమెంటరీలో అంబా అనే ఆడపులి పాత్రకు తన గొంతు అందిస్తున్నారు.

# అగ్రనటుల పారితోషకంపై చర్చ



## అభిమాన సంఘాల మధ్య పెరిగిన పోటీ

అగ్ర నటుల అభిమానులు వారి నటులపై వున్న అభిమానంతో వాగ్యుద్ధం చేసుకోవటం కొత్తేమీ కాదు కానీ, ఈ సామాజిక మాధ్యమం వచ్చాక మరీ ఎక్కువయిపోయాయి. ఈ అభిమానుల వార్స్ అనేవి ఒక్కోసారి ఒక్కో రకంగా రూపాంతరం చెందుతూ ఉంటాయి. ఇప్పుడు ప్రతి అగ్ర నటుడు తమ సినిమా ఒక్క భాషలో కాకుండా మొత్తం ఇండియా అంతా విడుదల చెయ్యాలని దానికి తగ్గట్టుగా పారితోషికాలు కూడా తీసుకుంటున్నారు. అలా చాలామంది నటుల మార్కెట్ కూడా బాగా విస్తరించింది కూడా. దానికి తగ్గట్టుగా ఆయా నటుల పారితోషికాలు కూడా బాగా పెరిగిపోయాయి. ఇలా పారితోషికాలు విషయంలో తమిళ సూపర్ స్టార్స్ రజనీకాంత్, విజయ్ అభిమానుల మధ్య సామాజిక మాధ్యమంలో విపరీతంగా వాగ్యుద్ధం జరుగుతోంది. తెలుగు నటుడు ప్రభాస్ పారితోషికంగా రూ.150 కోట్లు తీసుకుంటూ దక్షిణాదిలో ఎక్కువ పారితోషికం తీసుకున్న నటుడిగా ఉండేవారు అనేవారు. అలాగే తమిళ సూపర్ స్టార్ విజయ్ కు 'వారసుడు' సినిమాకి గాను రూ.120 కోట్లు ఇచ్చారనే ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే ఇప్పుడు తాజాగా విజయ్ పారితోషికం రూ. 250 కోట్ల పారితోషికం అని అభిమానులు చెపుతున్నా, ఈ సినిమాపై ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ విజయ్ కి ఎలివేషన్ ఇచ్చేందుకు అతని అభిమానులు దేశంలోనే అత్యధిక రెమ్యూనిరేషన్ తీసుకుంటున్నది తమ నటుడే అని చెప్పుకుంటున్నారు.



# దేశాన్ని కాపాడేందుకే కాంగ్రెస్‌కు మద్దతు

**రాజ్యాంగానికి అత్యంత ప్రమాదకారి ప్రధాని మోడీ**

**సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకారి ప్రధాని నరేంద్రమోడీ అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. సీపీఐ బలపరచిన వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ హంటర్ రోడ్ లోని డి కన్వెన్షన్ హాల్ లో సోమవారం వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ఈడీ, సీబీఐ, ఐటీ, జ్యుడీషియరీ లాంటి వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని తన మాట వినని ఇతర పార్టీల నాయకులను మోడీ జైలుకు పంపిస్తున్నాడని ఆరోపించారు. మరోవైపు మోడీ అధికారంలోకి వచ్చాక ఆర్థిక నేరగాళ్లు పెరిగిపోయారని, 2014 నుంచి పదేళ్ల కాలంలో 29 మంది ఆర్థిక నేరగాళు పది లక్షల కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టారని అన్నారు. ఈ ఆర్థిక నేరగాళ్లలో ముస్లింలు ఎవరూ లేరన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ హెూల్ సేల్ గా అమ్మకానికి పెట్టాడని, మోడీ హయాంలో అంబానీ, ఆదానీ ప్రపంచ కుబేరులుగా మారారని విమర్శించారు. మోడీతో చీకటి దోస్తానా వల్లనే రాష్ట్రంలో కేసీఆర్ ఓడిపోయారని, కమ్యూనిస్టులను దూరం పెట్టి కేసీఆర్ ప్రజలకు దూరం అయ్యారన్నారు. కేసీఆర్ నయవంచకుడని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసగించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల తరువాత బీజేపీలో చేరతారని తలకాయ ఉన్న వారెవరూ మాట్లాడరని, ఆయనకు ఆ అవసరమే ఉండదన్నారు. తాము దేశ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చి గెలిపించే బాధ్యత తీసుకుంటామన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే ఆత్మహత్యా సదృశ్యమే అవుతుందన్నారు. మోదీకి అధికార దాహం ఎక్కువగా ఉంటుందని, దేశాన్ని తన పదవి కోసం కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేందుకు కూడా వెనుకాడడం లేదని ఆరోపించారు.

**ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత నాదే..**

ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సీపీఐ సభలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటుందని, ఎరుపుకు మరణం లేదని అన్నారు. తాను కూడా వామపక్ష భావజాలంతోనే పెరిగానని, సీపీఐ, సీపీఎంలే తనను రాజకీయంగా నిలబెట్టాయని చెప్పారు. నేడు దేశానికి మోదీ రూపంలో పెను ప్రమాదం పొంచి ఉందని, తప్పుదారిన బీజేపీకి ఓటు వేస్తే పేదల బతుకులు ఆగం అవుతాయని అన్నారు.

**అంబేద్కర్ రాజ్యాంగం వల్లే నిలబడ్డా..:**

**– కడియం కావ్య**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో 40 ఏళ్ల తర్వాత అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే పోటీ చేసే అవకాశం ఒక మహిళగా తనకు వచ్చిందని కాంగ్రెస్ లోకసభ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని మోడీ మారుస్తామని అంటున్నారని, అందుకే బీజేపీ అధికారంలోకి రావద్దన్నారు. రాజ్యాంగాన్ని, లౌకిక వాదాన్ని కాపాడే కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. కేయూలో నిన్న జరిగిన మేధావులు రచయితల సభపై మతోన్మాద శక్తులు దాడి చేశారని, రేపు మళ్లీ అధికారంలోకి వస్తే ఇదే పరిస్థితి అంతటా ఎదురవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎర్రజెండ ఎర్రజెండ ఎన్నియలో.. ఎర్రెర్రనిదీ జెండ ఎన్నీయలో అంటూ పాట పాడి ఉత్తేజ పరిచారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి.విజయ సారథి, టి.వెంకట్రాములు, టి.విశ్వేశ్వర రావు, జిల్లాల కార్యదర్శులు సీహెచ్ రాజారెడ్డి, కె.రాజ్ కుమార్, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, నాయకులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, బీఆర్ లెనిన్, పి.సుగుణమ్మ, షేక్ బాష్ మియా, మద్దెల ఎల్లేష్, పనాస ప్రసాద్, బుస్సా రవీందర్, దండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**పరకాలలో..**

పరకాల నియోజకవర్గం గీసుగొండ మండల కేంద్రంలోని సీఎస్ ఆర్ గార్డెన్స్ ఏర్పాటు చేసిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి , కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు , ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ లతో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగురి భిక్షపతి, ఎస్సి సెల్ జిల్లా చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ, ఆనంద్ కుమార్, ప్రొఫెసర్ గాదె దయాకర్, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కడియం కావ్య, తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

**విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని, కడియం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలుపించాలని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. మాది ప్రజా ప్రభుత్వం..మీది గారడి మాటల ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తీన్మార్ మల్లన్నతోపాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, చీకటి శారద ఆనంద్, నెక్కొండ కల్పనా కిషన్ కుమార్, జక్కుల రవీందర్ యాదవ్, మానస రామ్ ప్రసాద్, గుంటి శ్రీనివాస్, మామిండ్ల రాజు, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, మాజీ కార్పొరేటర్లు ఏ.నాగరాజు, నలుబోల సతీష్, కూర వెంకట్, బంక సరళ, నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, అతని అనుచరులు వివిధ డివిజన్ ల నుంచి సుమారు 500 మంది సోమవారం నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి వారికి ఖండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో జే.రంజిత్ గౌడ్, పాలడుగుల ఆనంద్, సందీప్ రెడ్డి, నయీం నగర్ అనిల్, ఫజల్ ఖాన్, కృష్ణ మూర్తి యాదవ్, ఒంటరు కుమారస్వామి, జనగాం శంకర్, శ్రీనివాస్, శివ ప్రసాద్, బొక్క శరత్, అజ్జు, సీపీఐ, బీఎస్ పీ, ఉద్యమకారులు, కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలపై ప్రత్యేక ఫోకస్

**ప్రత్యేకాధికారి డాక్టర్ బి.గోపి**

**కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, పబ్లిక్ హెల్త్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పక్కధ్బందీ చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేకాధికారి డాక్టర్ బి.గోపి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హల్ లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో నగరంలో తాగునీటి సరఫరాపై హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి జీడబ్ల్యూఎంసీ, పబ్లిక్ హెల్త్, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా త్రినగరిలో ప్రతి రోజు ఎంత ఎంఎల్ డీ నీటి సరఫరా చేస్తున్నారు, తాగునీటి సమస్యలు ఏయే ప్రాంతాల్లో ప్రధానంగా ఉంది, నగరంలో ఎన్ని వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారనే వివరాలను డాక్టర్ గోపి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి వినియోగం పెరిగి భూగర్భ జలాలు తరిగిపోతున్నాయని, ఇలాంటి సమయంలో నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 66 డివిజన్లకు అవసరమైన తాగునీటి వనరులు అందుబాటులో ఉన్నాయని, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి సమస్య రాకుండా చూడాన్నారు. ప్రస్తుతం రోజు 210 ఎంఎల్ డి నీటి సరఫరా చేస్తున్నారని, దీనికి అదనంగా మరో 40 ఎంఎల్ డి తాగు నీటిని సరఫరా చేయాలన్నారు. వేసవి పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు చేయరాదన్నారు. నగర పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలపైన ప్రత్యేక దృష్టి సారించి అదనంగా నీరు అందించాలన్నారు. తాగునీటి సరఫరా రోజువారి నివేదిక కమిషనర్ కు సమర్పించాలన్నారు. నీటి సరఫరాలో సమస్యల పరిష్కారానికి స్వయం సహాయక బృందం సభ్యులు, రెసిడెంట్ వెల్ఫేర్ సంఘాల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్ కుమార్, ఈఈ లు రాజయ్య, బీఎల్ శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, ప్రత్యేక అధికారులు, డీఈలు, ఏఈలు, లైన్ మెన్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ సబ్ డివిజన్ ట్రాఫిక్ పోలీసులు నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో పట్టుబడిన సిలివేరు బాబుకు సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రెండు రోజుల జైల్ శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బాబును పరకాల సబ్ జైల్ కు తరలించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ చౌరస్తాకు తన మోటార్ సైకిల్ పై వెళుతున్న బాబును హెడ్ పోస్ట్ ఆఫీస్ సమీంలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. సోమవారం చార్జ్ షీట్ ఫైల్ చేయగా, ఈ మేరకు శిక్ష పడింది.

## బీఆర్ఎస్‌ను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక, మైలారం, పెద్ద కోడేపాక, హుస్సేన్ పల్లి, కాట్రపల్లి, రాజు పల్లి గ్రామాల్లోని ఉపాధి కూలీలు పనులు నిర్వహించే ప్రాంతంల మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు ప్రచారం నిర్వహించారు. వరంగల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్యారెంటీ లేని గారడి మాటలతో మాయ చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 100 రోజులు పూర్తి అయ్యే లోపు ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలం అయిందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినట్లు గుర్తు చేశారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, మండల పార్టీ అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి, పత్తిపాక మాజీ సర్పంచ్ చిట్టి రెడ్డి రాజిరెడ్డి, నాయకులు రామ్ శెట్టి లక్ష్మారెడ్డి, గంట శ్యాంసుందర్ రెడ్డి, జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com